# పిచ్చిలోకం

జి. అనూరాధ

రాజమండ్రి ప్లాట్ ఫాం మీద రైలాగింది. గుమ్మంలో నిలబడి అటూ ఇటూ చూసింది సీత, తమ్ముళ్లిద్దర్లోనూ ఒకరయినా వచ్చారేమోనని. ఎవరూ కనబళ్ళేదు. చూసి చూసి చివరికి పిల్లల్నిద్దర్నీ ముందుదింపి తర్వాత పెట్టే, బెడ్డింగ్ రైల్లోవాళ్లసాయంతో క్రిందికి దింపింది.

మనుషులు వచ్చాకగాని ఉత్తరాలు అందవు. ఈ దేశంలో రివాజు అది. ఉత్తరం అందితే సత్తిబాబుగాని, లక్ష్మణ్ గాని స్టేషన్‌కి తప్పకుండా వచ్చేవారే. కూలీని పిలిచి సామానువాడి నెత్తిన బెట్టి, రామూన్ని చంకెత్తుకుని, రాజాని చెయ్యి పట్టుకు నడిపిస్తూ బయటికి నడిచింది.

గేటు దగ్గరకు రాగానే రిక్షా వాళ్ళు ఈగల్లాముసరడం మొదలెట్టారు. ఒంటరి ఆడది, చిన్నపిల్లలు, సామాను చూడగానే ఆశ ఎక్కువగానే వుంటుంది. కిలోమీటరు దూరంలో వున్న ఇంటికి ఒకడు మూడు రూపాయి లంటే, ఇంకొకడు నాలుగు రూపాయిలు!

అర్ధ రూపాయి, ముప్పావలా ఇచ్చి వెళ్ళిన రోజులు న్నాయి. అలాంటిది ఇంతింత అడుగుతుంటే ఇవ్వలేక, ఇవ్వకుండా ఆ తెల్లవారుగట్ల అంత సేపు అక్కడ నిలబడి వుండలేక ఎలాగరా భగవంతుడా అనుకుంటూండేంతలో

"అమ్మాయిగారూ, ఇంటికాడికేనా!" అంటూ పలకరించాడు సూరన్న. చిన్నప్పుడు స్కూలుకి రిక్షా కట్టేవాడు. తన చదువు పూర్తయింది. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. కాని సూరన్న ఇంకా రిక్షాలాగుతూనే వున్నాడు.

"ఏమివ్వమంటావు?" అడిగింది సీత. సూరన్నని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టయింది.

"నాతో బేరాలేంటమ్మా!" అంటూ పెట్టే బెడ్డింగ్ పట్టుకునడిచాడు.

అనుసరించింది సీత.

ఆ విఘ్నేశ్వరుడి విగ్రహం, రైల్వే బ్రిడ్జి, పోస్టాఫీసు, అన్నీదాటి వెళ్తాంటే "ఎన్నాళ్లకి! ఎన్నాళ్లకి!" అన్నట్టు మనసు ఉరకలు వేస్తోంది. పుట్టి పెరిగిన ఊరుకి, అందులోనూ పుట్టింటికి- ఇన్నేళ్ల తర్వాత - రావడంకన్నా సంతోషం ఇంకోటుండదు.

దారిపొడుగునా సూరన్న ఏదో యోగక్షేమం విచారిస్తూ ప్రశ్నలు కురిపిస్తూనే ఉన్నాడు. ఏ ఊరు? అయ్యగారికేం పని? ఎంత జీతం? ఇద్దరేనా పిల్లలు? పిల్లలు చదువుకుంటున్నారా? ఏమేమిటో అడుగు తున్నాడు. సమాధానాలు చెప్తోందిగాని, మనసెక్కడో, మాటెక్కడో అన్నట్టుంది.

తెల్లారుతోంది.

పశులు జట్లు జట్లుగా బయలుదేరాయి. మనుషులు ఆకారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇళ్లముందు ఆడ వాళ్ళు తుడిచి, కళ్లాపు జల్లి, ముగ్గులు పెడుతున్నారు.

"గోదావరి వచ్చేసిందా సూరన్నా" అంటూ ఓ కర్కశమైన గొంతు వేసిన ప్రశ్న ఆలోచనల్లో మునిగిన సీతని ఈ లోకంలోకి లాక్కొచ్చింది.

చాలా మొరటుగా ఉన్న ఆకారం, రాక్షసి గొంతు చూసి పిల్లలిద్దరూ మగత నిద్రలోంచి బయట పడి కరుచుకున్నట్టు సీతని అదుముకున్నారు.

"వచ్చేసిందమ్మా!" అన్నాడు సూరన్న మలుపు దగ్గిర కొంచెం నెమ్మదిగా పోనిస్తూ.

"ఎవరూ, సీతమ్మా! బాగున్నావా అమ్మా! ఇద్దరు పిల్లలా! ముత్యాల్లాగున్నారు! ఎక్కడ్నించి రావడం?" అంటూ దగ్గిరగా వచ్చి ఆప్యాయంగా ప్రశ్నలు వేసింది.

మోటుగా ఉన్న ఆకారం, భయంకరమైన గొంతు చూసి భయపడి మరి కాస్త దగ్గిరగా కరుచుకుపోయారు రాజా, రామం ఆమె ఏదో చెయ్యమన్నట్టు భయ పడుతూ.

"బాగానే ఉన్నాను. హైదరాబాద్‌లో ఉంటున్నాం" ఈ లోపల రిక్షా ముందుకు వెళ్లిపోయింది.

"రత్తమ్మకదూ, సూరన్నా!"

"అవునండి"

"అలా అయిపోయిందేమిటి?"

"అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగే వుందండి ఆయమ్మ బతుకు!"

ఇంతలో ఇంటికి చేరింది.

నల్లగా లావుగా తుంగమొద్దులాంటి ఒళ్లు, మెల్లికన్ను, మొగాన్నలోతుగా గాటు, సంస్కారం లేని కురుచ వెంట్రుకలు, గంయ్‌మంటూ మైలుదూరం వినిపించేలా గొంతు-వీటన్నిటికీ పిల్లలు భయపడ్డారంటే ఆశ్చర్యం లేదు.

కాని ఆ మనిషి చరిత్ర తెలిసిన సీత కొంతసేపు ఏమీ మాట్లాడలేని లోతు ఆలోచనల్లో మునిగిపోయింది.

ఇరవై యేళ్ల క్రితం. తెల్లవారుగట్ల నాలుగువుతూం దేమో! రెండిళ్లివతల నుంచి గట్టిగా ఏడుపులు వినిపించ సాగాయి. భయంతో తలమీంచి దుప్పటి బిగించి పక్క కంటుకు పోయింది సీత. అప్పటికి పదేళ్లుంటా యేమో! నిశ్శబ్దాన్ని చీల్చుకొని ఆ ఏడుపులు, పెడబొబ్బలు చాలా గట్టిగా వినిపిస్తున్నాయి.

"నడవ్వే అమ్మా! ఇంకా ఏముంది? అంతా అయి పోయింది."

"నేను మా ఇంటికి వెళ్ళిపోతున్నాను! ఆయన ఈ రోజే వస్తారు. నేను ఇంటి దగ్గిరుండకపోతే కోపగించు కుంటారు. నేను వెళ్ళాలి!"

"ఇంటికి కాదు, గోదావరి ఒడ్డుకు పద! ఇంకెక్క దున్నాడు మీ ఆయన! నిన్ను నట్టేటముంచి ఎప్పుడో పోయాడు!"

"కాదు అబద్ధం! ఆయన పోలేదు! ఈరోజు బుధ వారం. ఇవాళే వస్తామన్నారు. నన్నింట్లో ఉండమన్నారు. తప్పకుండా వస్తారు."

"ఇవాళ బుధవారం గాదే రత్తమ్మా! శుక్రవారం. మీ ఆయన చెప్పిన బుధవారం వెళ్ళిపోయి పది రోజు లయింది. ఇంక రాడు. పద! త్వరగా ఆ కర్మకాండ కాస్తా ముగించుకు వస్తే సరిపోతుంది!"

"నెల్లమ్మా! ఆడదానికి ఈ బాధ తప్పదు. నీ బతుకు ఇలా బుగ్గిచేశాడు దిక్కుమాలిన దేవుడు!"

"నన్నెందుకమ్మా ఇలా కాల్చుకు తింటారు? మా ఆయన్ని, నన్ను సుఖంగా ఉండనివ్వరా?"

కాసేపు మాటల్లేవు. ఏడు పొక్కటే వినిపించ సాగింది.

"ఇలాకాదు. అవతల బండివాడు కనిపెట్టు క్కూర్చున్నాడు. ఈడ్చుకుపోయి అందులో పడెయ్యండి!"

ఆ తర్వాత ఏవో దెబ్బలు పడ్డట్టు, గట్టిగా ఏడ్చినట్టు శబ్దాలు. మరి కాస్తసేపటికి సద్దుమణిగింది.

ఏమయింది రత్తమ్మకి? ఏం చేస్తారు మొగుడు పోతే. ఆరోజు ఆమెకేం చేశారు వాళ్ళు? ఇవన్నీ అప్పుడు సీతకేమీ అర్థంగాలేదు. ఆ తర్వాత తల్లినడిగినా, నీకెందుకు అక్కర్లేని విషయాలు అంటూ కసిరిందిగాని సమాధానం చెప్పలేదు.

ఏవో కట్టు కథలు, పుకార్లు చాలా వింది. నలుగురు పిల్లలూ కలిసి ఆడుకొనే వేళ రత్తమ్మ కథ వింతగా

చెప్పుకొనేవారు.

రత్తమ్మ చిన్నప్పుడు నలుపయినా అందంగానే ఉండేది. పెద్దగా చదువుకున్నది కాదు. తండ్రి చిన్నతనంలోనే పోయాడు. తమ్ముడు నడిపే ఓ చిన్న వ్యాపారం మీద ఆ కుటుంబం పొట్టపోసుకొనేది. తమ్ముడికి స్నేహితులు ఎక్కువ. చెడు స్నేహాలు, తాగుడు లాంటి అలవాట్లున్న ఆ తమ్ముడు బాగా ఆస్తి



ఉన్న ఓ నడివయస్సు వ్యాపారస్థుడికి మూడో పెళ్ళిగా రత్తమ్మ నిచ్చి పెళ్ళి చేశాడు. ఆ వ్యాపారస్థుడికి ఆస్తి బాగా వుంది గాని పిల్లలు లేరు.

రత్తమ్మకి పెళ్లయ్యాక కొంత కాలం వరకు రోజులు బాగానే గడిచాయి. వయసులో పెద్దవాడయినా మొగుడు రత్తమ్మని బాగానే చూసుకొనేవాడు. వ్యాపారరీత్యా అతను కార్లోదూర ప్రయాణాలు చేస్తుండేవాడు. అలాంటి ట్రిప్పుల్లోనే ఒకసారి అతను బెజవాడ బయలుదేరాడు. నాలుగు రోజుల తర్వాత బుధవారానికి తిరిగి వస్తానని చెప్పాడు.

కాని తిరిగి రాలేదు. తర్వాత యాక్సిడెంటయిందని, బ్రేక్ ఫెయిలయి చెట్టునొకదాన్ని గుద్దిందని, డ్రైవర్ దూకేశాడు గాని లోపలున్న అతను చనిపోయాడని

చెప్పారు. శవాన్ని చూసిన రత్తమ్మ షాక్‌తో స్పృహ తప్పిపడిపోయింది. మొగుడు పోయాడన్న వార్త ఆమెకి నమ్మశక్యంగా లేదు.

ఆ తర్వాత రకరకాలుగా చెప్పుకున్నారు. ఆస్తికోసం తమ్ముడే రత్తమ్మ మొగుణ్ణి చంపించాడని అందరూ అనుకొన్నారు. మొగుడు పోయిన రత్తమ్మ మానసిక స్థితిని అర్థం చేసుకోని అతడు, మూర్ఖంగా ఆమెని హింసించే వాడు. బలప్రయోగం చేసేవాడు. నాటు వైద్యాలు తప్పించి ఆమె ఆరోగ్యం బాగు చెయ్యడానికి సరైన ప్రయత్నం చెయ్యలేదు. ఆ సంసారం గొడవంతా చిలవలు పలవలు పెట్టి రకరకాలుగా అందరూ అను కొంటుంటే పిల్లలు మరికాస్త విడ్డూరంగా చెప్పుకొనే వాళ్ళు.

సీత మనసులో రత్తమ్మ గతం అంతా కళ్ళెదుట కట్ట సాగింది. ఆమె ప్రస్తుతం ఎలా వుందోనన్న కుతూహలా న్నాపుకోలేక తల్లినడిగింది సీత.

"రత్తమ్మకిప్పుడు ఎలా వుంది? ఆ మధ్య పిచ్చిదై పోయిందన్నారు?"

"దానికేం పిచ్చీ లేదు, పాడూ లేదు. నిక్షేపంలా వుంది. మనలా ఆలోచించని వాళ్ళని, మనం చెప్పిన దానికి వంతపాడని వాళ్ళని పిచ్చివాళ్ళంటాం. అది నైజం. అంతే!"

"మరీ అంత వికృతంగా తయారైందేమిటి?"

"ఏముంది! పిల్లా జెల్లా లేరు. ఎప్పుడోగాని బయటికి రానివ్వరు. ఇంట్లో కట్టేసి కుక్కకి పారేసినట్టు నాలుగు మెతుకులు పారేస్తారు. అది తిని పనీపాటు లేకుండా ఉండేసరికి వొళ్ళొచ్చింది. అసలే నలుపు. దానికి తోడు వాతలు, దెబ్బలు బాగా తగిలి గాట్లు పడ్డంతో మరీ వికారంగా తయారైంది!"

"దార్లో కనిపించి పలకరించింది. బాగానే మాట్లాడింది."

"చెప్పానుగా, దానికి పిచ్చీ గిచ్చీ ఏమీ లేదు. నిక్షేపంలా మాట్లాడుతుంది. దాని పని అది చేసుకుంటుంది. ఎప్పుడో మొగుడు గుర్తొస్తాడంతే. అప్పుడు మాత్రం ఈ లోకంలో ఉండదు. అదేం చేస్తుందో దానికే తెలియదు!"

"పాపం, ఇంకా ఆ సంఘటన మర్చిపోలేదన్న మాట!"

"దాన్ని మరిచిపోనిస్తారా? తల్లి ముండపోగానే దాని బ్రతుకు మరీ అధ్వాన్నమై పోయింది. ఆ తమ్ముడు, పెళ్ళాం, పిల్లలు దాన్ని కొట్టి, తిట్టి, నానా హింసలు పెట్టారు. అదెప్పుడన్నా వెర్రి మొర్రిగా ప్రవర్తించినా, అర్థం చేసుకోడం, సానుభూతి చూపించడం మానేసి వావగొడ్తారు. వైద్యం చేయించరు!"

"దాని మొగుడికి బోలెడు ఆస్తి ఉంది గదా! ఇది వెళ్ళిపోయి ఎవడన్నా మంచివాణ్ణి చూసి పెంచుకొనుంటే సరిపోయేది!"

"ఇంకెక్కడి ఆస్తి! దాన్ని కాజేయాలనేగా వాళ్ళ ఎత్తు! మెల్లిగా ఆ తమ్ముడి కొడుకుని దానికి దత్తత నిచ్చామన్నారు. ఆస్తంతా ఆ కొడుక్కి దక్కేలాగ కాగితాలు అవీ వ్రాయించారు. చివరికి ఆ తమ్ముడు పోయాడు. వాడు చేయగా మిగిలిన నిర్వాకం ఈ కొడుకు పూర్తి చేస్తున్నాడు!"

సీత మనసు కలవరపడింది. ఈ దేశంలో ఆడది పెద్ద చదువులు చదవొచ్చు, ఉద్యోగాలు చేయొచ్చు, ప్రధాన మంత్రిగావచ్చు. కాని శతాబ్దాల క్రితం ఎప్పుడో ఎవరో వ్రాసినట్టు బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, ముసలి తనంలో కొడుకులు - ఇలా మగాళ్ళ చెప్పు చేతల్లో వాళ్ళ పంచన బతుకు వెళ్ళమార్చాల్సిందే! ఈ సంస్కృతి, సంప్రదాయం మారవు.

రెండు రోజుల తర్వాత. రత్తమ్మ ఏడుపు గట్టిగా వినిపిస్తోంది.

"కట్టేయ్! చేతులు, కాళ్ళు కట్టేయ్!" ఎవరో అరుస్తున్నారు.

రెండు మూడు సార్లు దెబ్బలు పడ్డ చప్పుడు.

"అమ్మోయ్! బాబోయ్! చంపకండిరా!" రత్తమ్మ ఏడుపు.

కాసేపటికి అంతా నిశ్శబ్దం.

"ఏమిటే అమ్మా' ఈ దౌర్జన్యం?"

"అదంతే లేవే! మామూలుగా జరిగేదే! అది ఏ పిల్లవాణ్ణో తిట్టడమో కొట్టడమో చేస్తుంది. పిచ్చెక్కువైందంటారు. గుండు గీయించి నిమ్మకాయ రసం అదీ మర్దనా చేస్తారు. కాళ్ళు, చేతులు కట్టేసి ఒళ్ళంతా హూనం అయ్యేలాగ బాదుతారు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోతుంది. నాలుగు రోజులు సరిగ్గా తిండి పెట్టరు. ఆ తరువాత పది పది హేనురోజులు దాకా నీరసంగా పడుంటుంది. ఎవర్నీ ఏమీ అనదు. ఎవరి జోలికీ పోదు. పిచ్చి తగ్గినట్టు లెక్క! ఇదంతా మాకు మామూలే!"

సీత కడుపులో దేవినట్టయింది. మనసు విరిగి పొయింది.

రత్తమ్మని పిచ్చిదాన్ని చెయ్యడం, అలా లోకాన్ని నమ్మించడం కొందరికి అవసరం. అలా నమ్మి అంతటి ఘోరాన్ని ఉదాసీనంగా ఏ స్పందన, చైతన్యం లేకుండా మామూలు విషయంగా భావించి ఊరుకోడం కొందరి బలహీనత! ఇదీ ఈ లోకం దౌర్భాగ్యం!

పదిహేను రోజులుండడానికి వచ్చిన సీత మర్నాడే తిరుగు ప్రయాణం కట్టడం ఇంట్లో అందర్నీ ఆశ్చర్య పరచింది.

## కైవల్యం

ఊపిరాడని ఇరుకు భావాలలో
సొంతంకాని ఎరువు ఆచారాలలో
భావదాస్యంలో
బానిసత్వంలో
ఎన్నాళ్ళిలా ముకుళించుకుంటావ్?

మూఢ విశ్వాసాల మేలిముసుగులో
మోడువారిన మూగవేదనలో
కన్నీటి కలతలలో
కలల వలయాలలో
ఎన్నాళ్ళిలా కుంచించుకుంటావ్?

బంధాల బాహ్యాలంకారాలలో
మమతల మాయపరదాలలో
ఆశల ఆరాటంలో
నిరాశ నిశీథిలో
ఎన్నాళ్ళిలా బంధించుకుంటావ్?

లే, నిన్ను నీవు తెలుసుకో—
దాస్యపు సంకెళ్ళను తెంచుకో—
ప్రచండ భానుడిలా మండిపో!
చైతన్య తరంగంలా ఎగసిపో!!
తేజఃకిరణంలా సాగిపో!!!

—ఝాన్సి కె.వి. కుమారి

